

వట్టికోట ఆళ్వారుస్వామికి నివాళులర్పిస్తున్న ఉపేందర్‌రెడ్డి, పద్మజ

గ్రంథాలయాలు జ్ఞానసముపార్జన కేంద్రాలు

నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞానసముపార్జన కేంద్రాలని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు, గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని బుధవారం చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిజమైన ప్రజల మనిషి, తన జీవితాన్ని తెలంగాణ ప్రజల కోసం అంకితం చేసిన తెలంగాణ మట్టిబిడ్డ ఆళ్వారుస్వామి సదా చిరస్మరణీయులన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు సుబ్బలక్ష్మి, కవిత, మహేశ్వరి, ఉమ, యాదమ్మ, అవినాష్‌రావు, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేష్‌యాదవ్, టి. రామ్మోహన్, పి. సుఖేష్ కుమార్, కృష్ణారెడ్డి, అశోక్, ముత్యం, జంగారెడ్డి, పాఠకులు, పోటీపరీక్షల అభ్యర్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హెబ్రోన్ చర్చి ట్రస్ట్, సొసైటీ సభ్యులతో సమావేశమైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, రాజీవ్‌సాగర్

హెబ్రోన్ చర్చి నిర్వహణకు కలిసి ముందుకు రావడం మంచి పరిణామం: ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి నిర్వహణలో చర్చి సొసైటీ, ట్రస్టు సభ్యులు 20 ఏళ్లుగా ఉన్న మనస్పర్థలను విడిచిపెట్టి కలిసిపోయి పనిచేసేందుకు ముందుకు రావడం మంచి పరిణామమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. హెబ్రోన్ చర్చి అడ్మినిస్ట్రేషన్, ఆరాధనకు సంబంధించినటువంటి విషయాల్లో సొసైటీ, ట్రస్ట్ వారు ఇరువురి మధ్య ఉన్నసమస్యలను పరిష్కరించుకుని చర్చి నిర్వహణను ట్రస్ట్, సొసైటీ కలిసి కోర్టు సూచనమేరకు నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం హెబ్రోన్ చర్చి కార్యాలయంలో ముఠా గోపాల్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ సాల్మన్‌రాజు, కృపాదానం, చర్చి సొసైటీ సభ్యులు బ్రదర్ జోసెఫ్ కురియన్, పీటచారి, ట్రస్ట్ సభ్యులు ఎఫ్‌సీఎస్ పీటర్ తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెండుతెలుగు రాష్ట్రాలలో సుమారు 10 వేల చర్చిలు కలిగిన ఈ హెబ్రోన్ చర్చి విషయంలో గాని అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన విషయాల్లో గాని ఎటువంటి ఇబ్బందులు రాకుండా మీరు ఇరువురు కలిసిపోయి హెబ్రోన్ చర్చికి మరింత మంచిపేరు తీసుకురావాలని కోరారు. బయటివారి జోక్యం లేకుండా చర్చిని నిర్వహించుకోవాలన్నారు. సమాజంలో క్రైస్తవులకు మంచిపేరు ఉందని ఆ పేరును మరింత ఇనుమడింపచేసి సమాజానికి మార్గదర్శకంగా నిలబడి ఈ చర్చిని స్థాపించిన బ్రదర్ భక్తసింగ్ పేరును నిలబెట్టాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈసందర్భంగా చర్చి సొసైటీ, ట్రస్టు సభ్యులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ అభినందించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్లు

జంతు సంక్షేమంపై అవగాహన సదస్సు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైదర్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం జంతు సంక్షేమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి శంభులింగం మాట్లాడుతూ, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు జంతు సంక్షేమంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరావు, నవీన్‌కుమార్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం జేవీజీకే శర్మ, ఉపాధ్యాయులు వైదేహి, శ్రీనివాస్, అన్వర్‌పాషా, విష్ణువర్ధన్‌రెడ్డి, జలాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్ తదితరులు

వికలాంగులను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం: ప్రసాద్

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో వికలాంగులను పూర్తిగా విస్మరించారని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో కన్వీనర్‌లు భారతి, వెంకటేష్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం నల్లకుంటలోని సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఢిల్లీలో వికలాంగుల జాతీయ అధికారిని కలిసి సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటిమార్పు రాలేదని అన్నారు. దీంతో ఉద్యమ కార్యాచరణకు దిగుతామని, త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తమ ఓటు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. బర్కత్‌పుర బస్‌డిపో 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని రత్నానగర్, బీజేపీ ఆఫీస్, అరవింద్ డిగ్రీ కాలేజ్, చుట్టుపక్క ప్రాంతాల్లో ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 1, సీసీ ష్రాఫ్ పరిధిలోని బూమన్న గల్లీ, రాజేంద్రనగర్ కాలనీ, లింగంపల్లి, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.



కాచిగూడ డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్ కన్నె ఉమాదేవి జలమండలి అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె వారికిసూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

\- బర్కత్‌పుర, (ఆంధ్రజ్యోతి)

కుక్కలున్నాయి.. జాగ్రత్త!

- రాంనగర్ అజార్ వీధిలో కుక్కల బెడద
- ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు



గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ రాంనగర్ సమీపంలోని అజార్ వీధిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. చీకటి పడిందంటే చాలు.. గుంపులు గుంపులుగా సంచరిస్తూ అటుగా వచ్చే వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. 5 నుంచి 8 కుక్కలు వీధుల్లో తిరుగుతూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఈ వీధినుంచి స్థానికంగా ఉన్న సెయింట్‌పాయిస్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల వెంట కుక్కలు వెంట పడుతుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రమేష్ అనే స్థానికుడు కిరాణా షాపుకు వెళ్తుండగా కుక్కలు అతని వెంటబడడంతో భయాందోళనకు గురై పరుగుతీసే క్రమంలో కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఇప్పటివరకు స్థానికులు ముగ్గురిపై దాడి చేశాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు వీధికుక్కలను పట్టుకొని తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

వీధి కుక్కలను పట్టుకుంటాం

వీధి కుక్కలను పట్టుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా సహకరించాలి

\- డాక్టర్ వనజ జీహెచ్‌ఎంసీ వెటర్నటీ అధికారి, ముషీరాబాద్

రోజూ ఇబ్బంది పడుతున్నాం



కుక్కలు వెంటబడడంతో భయంతో పరుగులు తీశాను. అదుపు తప్పి కింద పడడం వల్ల తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రతి రోజు కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- రమేష్, బాధితుడు

పార్కుల సుందరీకరణ పూర్తిచేయాలి

జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించిన కార్పొరేటర్



ఏఈలు అబ్దుల్ సలామ్, సంజయ్, డిప్యూటీ ఇంజనీర్ అశోక్‌కుమార్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనివినయ్ కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పార్కులను సుందరీకరణ చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీపార్క్ (సురభిపార్క్), కెనరా బ్యాంక్ పార్క్, అశోక్‌నగర్ పార్క్-1, పార్క్-2లను బుధవారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, హార్టికల్చర్ ఏఈలు అబ్దుల్ సలామ్, సంజయ్, స్ట్రీట్‌లైట్స్ డిప్యూటీ ఇంజనీర్ అశోక్‌కుమార్‌లతో కలిసి సందర్శించారు. ఆయా పార్కుల్లో ఉన్న పరిస్థితిని, అపరిశుభ్ర వాతావరణం, అంధకారం గురించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులతో మాట్లాడుతూ తాను మొదటినుంచి పార్కుల అభివృద్ధిపై కృషి చేస్తున్నామని ఇప్పటికి కూడా ఆయా పార్కుల అభివృద్ధిపనులు, సుందరీకరణ, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు పను లు నత్తనడకన సాగుతుండడంపై వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కుల్లో స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని, స్ట్రీట్ లైట్స్ డిప్యూటీ ఇంజనీర్ అశోక్‌కుమార్, సూపర్‌వైజర్ బాలునాయక్‌ను ఆదేశించారు. పార్కుల చుట్టూ ఎత్తైన ఫెన్సింగ్, నూతన గేట్ల ఏర్పాటు, వాకింగ్ పాత్‌వే, ఓపెన్ జిమ్ నిర్మాణం లాంటి పనులను పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సీనియర్ నేతలు రత్నసాయిచంద్, సత్తిరెడ్డి, ఆనంద్‌రావు, ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కార్మికవర్గానికి, రైతాంగానికి తీరని అన్యాయం

- కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ల నేతలు



లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

కవాడిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, కేంద్ర బడ్జెట్‌తో కార్మిక, రైతాంగానికి ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని పలువురు కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్‌ల నేతలు ఆరోపించారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక సంఘాలు ట్రేడ్‌యూనియన్‌ల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉపాధ్యక్షురాలు, ప్రేంపావని, సంయుక్త కిసాన్‌మోర్చ రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘంరాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకట్‌రాములు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి, నాయకులు నాగన్న గౌడ్, బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్, యూటీయూసీ నాయకుడు భరత్, ఐఎఫ్‌టీయూ పద్మ, అనురాధ మాట్లాడుతూ, వ్యవసాయ మార్కెట్ సవరణ ముసాయిదాను, రద్దుచేయాలని కోరారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత విధించవద్దని కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే యోచనను విరమించుకోవాలని, రాష్ట్రానికి విభజన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో అసంఘటిత కార్మికుల సంక్షేమ అంశాలను ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్యలో భాగమేనని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేష్, జయలక్ష్మి, ఈశ్వర్‌రావు. రమేష్, పద్మశ్రీ, రైతు సంఘం నాయకులు సంధ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, పద్మ, చంద్రశేఖర్‌తో పాటు కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి: జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అసమానతలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవం, సామాజిక న్యాయ సాధన కోసం శ్రామికుల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా లాల్ నీల్ శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన దళితుల సామాజిక, ఆర్థిక రాజకీయ సాధికారితపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, అణగారిన వర్గాలు శ్రామికులు, దళితులలో అనైక్యత రాకుండా విశాల దృక్పథంతో సంఘటితంగా ఉద్యమించాలని, భూమి వనరులు. బడ్జెట్‌ను సాధించుకోవాలని ఆయన కోరారు. కేంద్ర బడ్జెట్‌లో దళితులకు ఐదుశాతం నిధులుకేటాయించలేదని ఆయన ఆరోపించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంమూలంగానే ప్రధాని అయ్యానని చెబుతున్న మోదీ రాజ్యాంగాన్ని అంబేడ్కర్‌ను అవమాన పరుస్తున్నా నోరు మెదపడం లేదని ఆయన పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జాన్‌వెస్లీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, సీనియర్ దళితనేత రాజు, ఎం నర్సింగరావు. ప్రొఫెసర్ యాదగిరి, టీపీఎస్‌కే ప్రతినిధి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు వెంకట్‌రాములు, పద్మ, కేవీపీఎస్ నేత స్కైలాబ్ పాల్గొన్నారు.

వీసాలేదు.. పాస్‌పోర్టు లేదు

- నగరంలో పట్టుబడ్డ నైజీరియన్
- డ్రగ్స్ స్మగ్లర్‌గా మారకముందే స్వదేశానికి పంపే ప్రయత్నం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి వీసా, పాస్‌పోర్టు లేకుండా నగరంలో తిరుగుతున్న నైజీరియన్‌ను హెచ్ న్యూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించిన క్రమంలో ముంబైలో అరెస్టయి, రెండేళ్ల జైలు జీవితం గడిపి వచ్చినట్లు తేలింది. అతడు డ్రగ్స్ స్మగ్లర్‌గా మారకముందే వెంటనే డిపోర్టేషన్ ద్వారా నైజీరియాకు పంపాలని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశించారని హెచ్ న్యూ డీసీపీ వైవీ సుధీంద్ర తెలిపారు. బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ పూర్తి వివరాలు వెల్లడించారు. నైజీరియాకు చెందిన ఇకెచుకువు సెల్విస్టర్ అలియాస్ సెల్విస్టర్ 2012లో బిజినెస్ వీసాపై ఇండియాకు వచ్చాడు. ముంబైలో క్లాత్ బిజినెస్ చేస్తూ.. ఇక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసిన క్లాత్స్‌ను నైజీరియాకు ఎగుమతి చేసేవాడు. 2019లో ముంబై పోలీసులు సెల్విస్టర్‌ను పాస్‌పోర్టు కేసులో అరెస్టు చేశారు. దాంతో అతను ముంబై సెంట్రల్ జైల్లో జైలు శిక్ష అనుభవించి వచ్చాడు. ఆ తర్వాత ముంబైలోని ఉల్వే ప్రాంతంలో ఉంటున్న నైజీరియన్ స్నేహితుల వద్దకు చేరి అక్కడే ఉంటున్నాడు. స్నేహితులంతా డ్రగ్స్ సరఫరాలో ఆరితేరుతుండగా.. అతను మాత్రం ఇంకా అలాంటి నేరాలకు పాల్పడలేదు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితుల వద్దకు వచ్చాడు. వారు కూడా ముంబై, బెంగళూరుకు చెందిన ప్రధాన డ్రగ్స్ స్మగ్లర్స్‌తో లింకులు ఉన్నవారే కావడం గమనార్హం. సెల్విస్టర్ వారితో కలిసి నగరంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో హెచ్ న్యూ పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ డానియెల్ టీమ్ రంగంలోకి దిగి సెల్విస్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా.. వీసాగానీ, ఎలాంటి పాస్‌పోర్టుగానీ లేవని, అదే కేసులో గతంలో ముంబైలో అరెస్టయినట్లు తేలింది. హెచ్ న్యూ పోలీసులు ఎఫ్ఆర్ఆర్‌వో సహకారంతో డిపోర్టేషన్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని డీసీపీ సుధీంద్ర వెల్లడించారు.

సైకిల్ దుకాణంలో అగ్నిప్రమాదం

- ఇద్దరు వ్యక్తులకు స్వల్పగాయాలు
- మంటలు అదుపు చేసిన జీడిమెట్ల ఫైర్ సిబ్బంది

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దూలపల్లి రోడ్డులోని ఓసైకిల్ షాప్ దుకాణంలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. జీడిమెట్ల ఫైర్‌సిబ్బంది మంటలను అదుపుచేయడంతో ప్రమాదం తప్పింది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రతన్‌లాల్ అనే వ్యక్తి దూలపల్లి గ్రామం,ప్రభుత్వ పాఠశాల పక్కన సాయిరాం సైకిల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం 5.35 నిమిషాల సమయంలో దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో రతన్‌లాల్, షాపులో పనిచేసే మరో యువకునికి స్వల్ప గాయాలయ్యాయి. గ్యాస్ రీఫిల్లింగ్ లేదా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల గాని మంటలు ఎగిసిపడి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేత మన్నె మహేష్ యాదవ్

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దేశానికే ఆదర్శం'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలలో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం దేశానికే ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మన్నె మహేష్ యాదవ్ అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా బీసీలకు ఇంత శాతం రిజర్వేషన్లు కల్పించలేదని, ఆ ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందని అన్నారు. బుధవారం కాచిగూడ చప్పల్‌బజార్‌లో సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శ్యామ్‌రావు, హరితిలక్ సింగ్, రమణారెడ్డి, పద్మ, లక్ష్మి, కవిత, శ్యాంసుందర్‌రావు, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా మహాపూర్ణాహుతి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని శ్రీ శృంగేరి జగద్గురు మహాసంస్థానం శ్రీ పంచముఖ ఆంజనేయ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహోత్సవాల సందర్భంగా బుధవారం కన్నులపండువగా, వైభవోపేతంగా మహాపూర్ణాహుతి హోమం నిర్వహించారు. ఈసందర్భంగా సుప్రభాతం, శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణ, అర్చన, నివేద నీరాజనం, మంత్రపుష్పం, బలిహరణ, కోట్నాల వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజారోహణం, మూగబలి, పుష్పయాగం, పవళింపుసేవ, రుత్విక్‌సన్మానం జరిగింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి జనార్దనమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ జ్యోతి జోషి మృతి



బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ జ్యోతి జోషి (76) గుండెపోటుతో మృతి చెందారు. కాచిగూడలోని ఆమె నివాసంలో బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో ఆమె కుటుంబసభ్యులు వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్లడానికి ప్రయత్నించగా.. అప్పటికే ఆమె మృతి చెందారు. కోఠి మహిళా కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా ప్రస్థానం ప్రారంభించిన జ్యోతి జోషి భారత మహిళా క్రికెట్ జట్టు మేనేజర్ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి ఏపీ స్పోర్ట్స్ అథారిటీ సభ్యులుగా కూడా పనిచేశారు. భారత మహిళా క్రికెటర్లు పూర్ణిమారావు, రజనీ వేణుగోపాల్, మిథాల్‌రాజ్, సురేఖ, జీఎన్ఎస్.లక్ష్మి తదితరులు జోషి ప్రోత్సాహంతో అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగారు. ఆమె మృతి పట్ల పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంతరావు, డిగ్రీ కాలేజ్ ఫిజికల్ డెరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమన్న, ప్రధాన కార్యదర్శి బాలరాజు, జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ అధ్యక్షుడు బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పర్వతాలు గౌడ్ సంతాపం తెలిపారు.

బాలికను వేధించిన కేసులో.. యువకుడికి మూడేళ్ల జైలు, రూ.10వేల జరిమానా

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధించిన కేసులో ఒక యువకుడికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష పదివేల రూపాయల జరిమానా విధించింది. కాచిగూడ పీఎస్ సీఐ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తిరుపతి జిల్లా వాకాడ మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రమణయ్య కుమారుడు ఎంబటి మహేష్(30) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. 2022లో బర్కత్‌పురకు చెందిన 14 ఏళ్ల బాలికను లైంగికంగా వేధించాడు. వాట్సాప్ గ్రూపులలో అసభ్య పద జాలాలతో మెసేజ్‌లు పెట్టేవాడు. బాలిక ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసు విచారణకు రావడంతో.. జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తున్నట్లు నాంపల్లి 12వ అడిషనల్ సెషన్స్‌కోర్టు జడ్జి టి.అనిత బుధవారం తీర్పు వెల్లడించినట్లు సీఐ చంద్రకుమార్ తెలిపారు.

ఉద్యోగం రాలేదన్న బాధతో రైలు కిందపడి ఇంజనీరింగ్ యువకుడి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ పూర్తిచేసినా.. ఉద్యోగం రాలేదన్న బాధ, మరోవైపు కుటుంబ కలహాలతో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ లో నివాసముంటున్న పోచయ్య కుమారుడు మణికంఠ (33) ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. కానీ ఎక్కడా ఉద్యోగం రాలేదు. దాంతో మనోవేదనకు గురైన మణికంఠ జీవితంపై విరక్తి చెంది గురువారం విద్యానగర్ జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ పరిధిలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

నడుస్తున్న రైలు నుంచి కింద పడిపోయి.. రాజస్థాన్‌కు చెందిన రైతు మృతి

బర్కత్‌పుర ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున రైల్లో బాత్రూం కి వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోయి ఓ రైతు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మంగళ రాము (68) రైతు. బెంగళూరులో ఉన్న కుమారుని వద్దకు బంధువుతో కలిసి జైపూర్- మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బెంగళూరు వెళ్తున్నాడు. గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మంగళ రాము బాత్రూంకి వెళ్లాడు. ఆ సమయంలో రైలు యాకత్‌పుర ఉప్పుగూడ రైల్వేస్టేషన్ల పరిధిలో ఉంది. బాత్రూంకి వెళ్లిన రాము ప్రమాదవశాత్తు రైల్ డోర్ నుంచి కింద పడిపోయాడు. ఆ సమయంలో మేల్కొని ఉన్న సమీప బంధువు చైన్ లాగి రైల్‌ను ఆపాడు. 108 కు సమాచారం అందించగా అప్పటికే మంగళ రాము మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బెంగళూరు నుంచి వచ్చిన కుమారునికి అప్పగించినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకుల ఆత్మహత్య

- ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. మరొకరు సీఏ విద్యార్థి

అమీర్‌పేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా మరొకరు సీఏ చదువుతున్నాడు. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా బూగారం మండలం బోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గంతల కుమార్(28) గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బీకేగూడ సంజయ్ గాంధీనగర్ కాలనీలో తన స్నేహితుడు గంగాధర్‌తో కలిసి ఉంటున్నాడు. బుధవారం ఉదయం గంగాధర్ బయటకు వెళ్లి తిరిగివచ్చేసరికి కుమార్ ఉరేసుకుని కనిపించాడు. గంగాధర్ ఫిర్యాదు మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. 'ఈ జీవితం నాకు నచ్చలేదు నన్ను క్షమించండి' అని అందులో ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

బాపూనగర్ హాస్టల్‌లో సీఏ విద్యార్థి..

మంగళవారం రాత్రి సీఏ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్నాటక రాయ్‌చూర్ జిల్లాకు చెందిన రాజుశెగ్గి కుమారుడు అమర్‌జిత్ (18) ఎస్ఆర్‌నగర్ బాపూనగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ సీఏ చదువుతున్నాడు. డిసెంబర్ 22న పరీక్షలు రాసి సొంత గ్రామానికి వెళ్లాడు. పరీక్ష లు సరిగా రాయలేదని బాధపడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జనవరి 27న మరో పరీక్ష రాయాల్సి ఉండగా తిరిగి నగరానికి వచ్చి హాస్టల్ ఉన్నాడు. మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లాల్సి ఉండగా తన ఆరోగ్యం బాగాలేదని గదిలోనే ఉన్నాడు. రాత్రి 10.30 గంటల సమయంలో రూమ్‌మేట్ ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో హాస్టల్ నిర్వాహకులకు తెలియజేశాడు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిచి చూడగా అమర్‌జిత్ ఉరి వేసుకుని కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ జరిపి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.